# దేముడు తోట

లత

పూజారి రామబ్రహ్మం సచ్చరిత్రుడైన వ్యక్తి. రోజూ మూకాంబికని చూట్టానికి వచ్చే భక్తులు వేసే చిల్లర డబ్బులతో, దేముడు తోటలో కాసే పళ్ళతో, కూరలతో కాలం వెళ్ళబుచ్చుకుంటున్న నప్రతిగ్రహీత. ఆయన భార్య పోయి చాలా రోజులయింది. పదహారేళ్ళ కూతురు బంగారు బొమ్మలా వుండే కరుపమ్మే ఆయన సర్వస్వమూను.

ఈ పిల్లకి ఎలా పెళ్ళి చెయ్యటము అనే సమస్యే ఆయన్ని నిరంతరమూ వేధిస్తూ వుండేది. కరుపమ్మ చేతికి నీలం రాయి వేసిన బంగారు వుంగరం తప్ప మరేమీ నగలు లేవు. ఆ వుంగరమయినా ఆమె తల్లిది.

"రామబ్రహ్మం విభూతి పెట్టినా, తీర్థం యిచ్చినా రోగాలు పోతాయి, కష్టాలు తొలగుతాయి" అనే నమ్మకం ఆ చుట్టు పక్కల ప్రజల్లో వుంది.

పరిస్థితి యిలా వుండగా దేముడి తోటలో వున్న బావిలో ఎవరో పడ్డట్టు అయిన చప్పుడికి అదిరిపడి లేచి కూర్చున్నాడు రామబ్రహ్మం. పక్క మంచం మీద కూతురు లేదు. ఆయన పై ప్రాణాలు పైనే పోయినయి. కళ్ళు తిరిగినట్లయి వెనక్కి పడిపోయాడు.

తెల్లవారి స్పృహ తెలిసిన ఆయనకి విషయం జ్ఞాపకం వచ్చి దేముడి తోటలోకి పరుగెత్తాడు. కూతురు పూలసజ్జలోకి నిత్య మల్లెపూలు కోస్తున్నది. అమ్మయ్య అనుకున్నాడు రామబ్రహ్మం.

"ఏం నాన్నా! అలా వున్నావు? రాత్రి నిద్ర పట్టలేదా?" అన్నది ఆమె.

"పట్టిందమ్మా!" అంటూ కూతురు వంక ఆప్యాయంగా చూసుకున్నాడు ఆయన.

తన కూతురు జగదేక సౌందర్యవతి లాగా వెలిగిపోతోంది. గంతకు తగ్గ బొంత నొకణ్ణి చూసి యీ పిల్లనీ, తన అర్చకత్వాన్నీ, యీ దేముడి తోటనీ అతనికి యిద్దామనుకుంటున్నాడు. ఆ కుర్రాడు ఏ క్షణాన్నయినా రావచ్చు. అతని పేరు కుమారన్. తన కూతురు నిన్నటికంటె యివ్వాళ ఏదో కొత్తగా కనిపిస్తోంది ఆయన కళ్ళకి.

నిన్నటిదాకా కరుపమ్మా కుమారన్ యీడూ జోడూ అనుకున్నాడు. ఇవ్వాళ యీ పిల్ల కాలిగోటికి కుమారన్ పోలడేమో అనిపిస్తోంది అతడికి. ఏం చెయ్యాలి మాట యిచ్చాడు.

"చూడమ్మా! నిన్ను కుమారన్‌కి యిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను తెలుసుగా నీకు. అతను యివ్వాళ రావచ్చును. లగ్గం పెట్టించమంటావా తల్లీ" అన్నాడు మెల్లిగా భయపడుతూ రామబ్రహ్మం.

"కరుపమ్మ అంటే పార్వతీదేవేకదా నాన్నా, నాకా పేరుపెట్టి కుమారన్‌తో పెళ్ళి ఎలా చేస్తావు? కుమారన్ అంటే మురుగన్ కదా. వరస కుదరదు. అందులో యీ దేవుడు తోటలో." అని వెళ్ళిపోతున్న కూతురు కేసి నిర్ఘాంతపోతూ చూసాడు







రామబ్రహ్మం.

ఈ సంభాషణ జరిగిం తరువాత ఆయ నకు కూతురంటే భయం ఎక్కువయింది.

కుమారన్ వచ్చాడుగాని తనకు సహాయ పడుతున్నాడు తప్ప కరుపమ్మ కేసి చూట్టం లేదు. ఒక రోజున అదేమిటని అడిగితే "నేను మీ అమ్మాయిని పెళ్ళి చేసుకోనండి. క్షమించాలి మీరు. ఆ అందం ఏమిటి? ఆ తేజస్సు ఏమిటి? నన్ను యిలా బతక నివ్వండి" అని అనేశాడు.

ఒక రోజున కూతురు చేతివంక చూసి "నీ చేతి ఉంగరం ఏదమ్మా!" అని అడిగాడు రామబ్రహ్మం.

"బావిలో పడింది నాన్నా. తీద్దాంలే. యీ దేముడి తోటలో వస్తువులు ఎక్కడికీ పోవు." అని సమాధానం చెప్పింది కరుపమ్మ.

ఒక రెండు మూడు రోజులు అట్లా గడిచినయి. భగవంతుడి పిలుపువిన్న రామ బ్రహ్మం. ఒక తుమ్ముతో ప్రాణం వదిలాడు.

కరుపమ్మ ఆయన సంస్కారం అయ్యే వంకూ వున్నది. తరవాత ఏమయి పోయిందో తెలియలేదు కుమారన్‌కి. ఏ పోలీసు రిపోర్టు యిద్దామనుకున్నా తననే దోషిగా చేస్తారని భయంతో వూరుకున్నాడు. అర్చకత్వం. దేముడు తోట అతనే చూసు కుంటున్నాడు. ఆ చుట్టు ప్రక్కల ప్రజల అనుమతితో.

ఒక రోజున బావిలో పూడిక తీస్తుంటే ఓ అస్థిపంజరం బయట పడ్డది. ఆ అస్థి పంజరం వేలికి కరుపమ్మ చేతి నీలపురాయి ఉంగరం వుంది. దిగ్భ్రాంతుడైన కుమారన్ మనసులో రెండున్నర ఏళ్ళుగా ఈ దేముడు తోటలో వున్న కరుపమ్మ ఎవరో భాసిం చింది. వెంటనే ఆలయంలోకి పరుగెత్తి "తల్లీ! మూకాంబికా! నువ్వు వృద్ధుడైన పూజారిని పుత్రికా దుఃఖాన్నుంచి రక్షించ డానికి దిగి వచ్చావా అమ్మా! నువ్వు నువ్వని గ్రహించలేని దౌర్భాగ్యుణ్ణి" అని తల గుమ్మానికేసి మోదుకున్నాడు. "పూజారీ! లే. ఇది దేముడి తోట యిక్కడ మృత్యువు వుండదు. దుఃఖం కూడా వుండదు. జీవితం కూడా వుండదు, మరణం కూడా వుండదు. యీ శూన్యాన్ని నింపటానికే నేను మానవిగా తిరిగాను. గతించిన వృద్ధ పూజారి అతి ధార్మికుడు. అతని కంటినీరు యీ దేముడి తోటలో పడితే దేముడికే ప్రమాదం. అందుకే నేను కరుప్పమ్మనయినాను. ఈ రహస్యం నీలోనే వుండాలి" — అని ఎవరో చెప్పినట్లుయింది. ఆ రోజునుంచీ కుమారన్ మాట్లాడటం ఎవరూ వినలేదు. అతడు మూకాంబికకు తగిన పూజారి! □